క్లుప్తంగా

అసంక్రమిత వ్యాధుల పరీక్షలు



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం అసంక్రమిత వ్యాధులపై పరీక్షలను నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అదేవిధంగా దినసరి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్యవిస్తరణాధికారి లక్ష్మీకాంత్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ రాముడు మృతి



సి.రాముడు (ఫైల్)

శాంతినగర్: వడ్డేపల్లి ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ తనగలకు చెందిన చాకలి రాముడు(52) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. గురువారం బీపీ అధికమవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజమ్మ, కుమారుడు వెంకటేష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

మిరప రైతుల ఆందోళన

రాజోళి: అకాల వర్షంతో మండలంలోని మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం మండలంలో అక్కడక్కడ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో కల్లాల్లో మిరపను ఆరబెట్టారు. దీంతో ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. మిరపను కాపాడుకునేందుకు టార్పాలిన్లు, కవర్లను కప్పి మిరప తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తికి సపర్యలు



ధరూరు: మండల కేంద్రంలో కొన్ని నెలలుగా తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు చేసి మానవత్వం చాటుకున్నారు. ధరూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచు సవారన్న, అర్చకులు కిష్టాచారి, వడ్ల అంజి, నాగరాజు, జంగిలన్న, ఆనంద్ తదితరులు చేరదీసి మతి స్థిమితం లేని వ్యక్తికి క్షవరం, గుండు చేసి స్నానం చేయించారు. అలాగే కొత్త దుస్తులు వేశారు. ఆర్ఎంపీ వైద్యులతో పరీక్షలు చేయించారు. మెరుగైన చికిత్స కోసం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో ఉగాది పండగను పురస్కరించుకొని గురువారం ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు డాక్టర్ వీఎం అజయ్ క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ గుమ్మ గోవర్ధన్ ఉన్నారు.

రెండు గ్రాముల బంగారం వితరణ

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారికి ఆలయానికి అయిజ మండలంలోని సింధనూర్ గ్రామానికి చెందిన విక్రమ్, శ్యామల దంపతులు గురువారం 2 గ్రాముల బంగారాన్ని ఆలయ సిబ్బంది శ్రీను, అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

పెబ్బేరు: మండలంలోని పెంచికలపాడులో క్రీడాకారులకు గురువారం ఎస్ఎంజీ స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సత్యారెడ్డి క్రికెట్ కిట్లు అందజేశారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో యువకులకు కిట్లు అందజేసి యువకులు క్రీడారంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఇంకెన్నాళ్లు ఇబ్బందులు!



పెద్దవాగుపై వంతెన నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో నిలిచిన నీరు

- ఐదేళ్లుగా సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు
- గుంతలమయంగా తాత్కాలిక మట్టిరోడ్డు



ఫిల్లర్ల నిర్మాణం కోసం తవ్విన గుంతలలో పారుతున్న వాగునీరు



గుంతలమయంగా మారిన తాత్కాలిక మట్టిరోడ్డు

ఎర్రవల్లిచౌరస్తా: వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అవసరమైన చోట ప్రజల సౌకర్యార్థం వంతెనల ఏర్పాటుకు కసరత్తు చేసింది. ఇందులో భాగంగా ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు సమీపంలో పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రూ. 2 కోట్ల 52 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించి నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయాలని ఆదేశించింది. 2018 సంవత్సరం ఫిబ్రవరి నెలలో కాంట్రాక్టర్ వంతెన నిర్మాణ పనులను ప్రారంభించాడు. అప్పటినుంచి పనులు నత్తనడకన చేస్తుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల అలసత్వం వల్ల బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి దాదాపు ఐదేళ్లుగా గడుస్తున్నా పనులు ముందుకు కదలడంలేదు. దీంతో ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లు పరిస్థితి దాపురించిందని పలువురు పేర్కొన్నారు.

వర్షాకాలంలో తప్పని తిప్పలు

ప్రతి వర్షాకాలంలో బ్రిడ్జి లేకపోవడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఈ మార్గం గుండా వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణాలు కొనసాగిస్తారు. బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించినప్పుడు ఉన్న రోడ్డును కూడా పూర్తిగా తొలగించి వాగును దాటేందుకు పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు గుంతలమయంగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపించారు.

పట్టించుకోని అధికారులు, పాలకులు

వాగు ఉధృతంగా ప్రవహించినపుడు ఇటిక్యాల మండలంలోని షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం గ్రామాలతో పాటు మానోపాడు, ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. పలుమార్లు జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు సమస్యను మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం



బ్రిడ్జి నిర్మాణం చేపట్టి నాలుగు ఏళ్లు పూర్తైనా పనులు ముందుకు సాగడంలేదు. వాగు దగ్గర ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నాం. అధికారులు నిర్లక్ష్యం వీడాలి. పనులను వేగవంతం చేయాలి.

– ఇసాక్, ఆర్. గార్లపాడు గ్రామస్తుడు

బ్రిడ్జిని త్వరగా నిర్మించండి



ప్రతి వర్షాకాలంలో ఇక్కడ పెద్దవాగు పొంగి పొర్లుతుంది. దీంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. పలుపార్లు అత్యవసర పరిస్థితుల్లో వాగును దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో వాగును దాటలేక పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జిని త్వరగా నిర్మించాలి.

– రవికుమార్, కారుపాకుల గ్రామస్తుడు

ఆరునెలల్లో పనులను పూర్తి చేయిస్తాం

బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించాం. వర్షాకాలంలో పిల్లర్ గుంతలలో నీరు నిలిచింది. దీంతో పనులకు ఆటంకంగా మారింది. పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వారం కిందట కాంట్రాక్టర్‌తో కలిసి వాగు పరిస్థితిని పరిశీలించాం. త్వరలోనే పనులను ప్రారంభించి ఆరునెలల్లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషి చేస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్అండ్‌బీ, ఏఈఈ

మధ్యాహ్న భోజనం పరిశీలన



లింగన్‌వాయిలో భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ తదితరులు

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి, ఎంఈఓ అశోక్ కుమార్, ఎంపీపీ పింజరి బేగంలు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి వారు మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు.

మానవపాడు: మండలంలోని మద్దూరులో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ రమణరావు, ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

రాజోళి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీటీసీ సుగుణమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ గోవిందు రావుతో కలిసి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలా జ్యోతి, మూగెన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సహపంక్తి భోజనం

అయిజ: మండలంలోని ఉత్తనూరు ప్రభుత్వ పాఠశాలలో గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సాయిప్రకాష్ మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రతి గురువారం సహపంక్తి భోజనం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుదర్శనమ్మ, ఎంపీడీఓ సాయిప్రకాష్, ఎంపీఓ నరసింహారెడ్డి, ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ లక్ష్మిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

న్యాయం చేయాలని భారీ ర్యాలీ

ఆత్మకూర్: మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని మాదాసి కుర్వ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. గురువారం ఆత్మకూర్‌లో ఆసంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుర్వ డప్పుల మోతతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంచార జాతులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. గొర్రెల కాపరులుగా సంచార జీవితం కొనసాగిస్తున్న తమ కుటుంబాలు దుర్భర జీవితాలను బతుకీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, వెంకటన్న, సత్యన్న, శ్రీశైలం, బాలరాజు, తిరుపతయ్య, సీతారాములు, పెద్దమల్లేష్, లక్ష్మన్న, బాలస్వామి, కుర్వరవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మల్దకల్: మండలంలోని మద్దెలబండ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప, ఉపాధ్యాయులు తిమ్మప్ప, శైలజ, సంగీత, కవిత పాల్గొన్నారు.



ఆస్తిపన్ను చెల్లించాలి



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: మున్సిపాలిటీ పరిధిలో గృహ యజమానులు, వ్యాపారులు ఆస్తి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కోరారు. గురువారం వివిధ వార్డుల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్, సీనియర్ అసిస్టెంట్ వీరేందర్, బిల్ కలెక్టర్ మహేంద్రనాథ్, నరేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో గురువారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. భీమవరంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 74 మంది పురుషులు, 60 మంది మహిళలు మొత్తం 134 మంది పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసూనరాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో ఎంపీపీ బీసమ్మ, సర్పంచు మద్దమ్మ ఆదేవిధంగా మెన్నిపాడులో సర్పంచు బజారన్న గురువారం కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. తక్కశిలలో 121 మంది, మెన్నిపాడులో 144 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు యాకుబ్‌బాషా, హేమ మానస, ఏఎన్ఎంలు నర్సమ్మ, మహేశ్వరి, కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, బాలకృష్ణ, ఉపసర్పంచు ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

ఉండవెల్లి: విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించమని జెడ్పీ సీఈఓ విజయ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పాఠశాల, నర్సరీ, ఉపాధి హామీ పథకం, మెన్నిపాడులో కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడారు. నర్సరీలో మొక్కలను పరిరక్షించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం అంతర్గత రోడ్లు, పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. మెన్నిపాడులో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉచితంగా కంటి అద్దాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ గౌరి, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, హెచ్ఎం సుజాత, కార్యదర్శులు అశోక్, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం



అలంపూర్ చౌరస్తాలో ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీని ఆయన బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన మాదన్న హైదరాబాదులోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(నిమ్స్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1 లక్ష మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

అయిజ: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని బైనిపల్లిలో మారెమ్మ దేవర ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్య సాధన



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ అధికారి నర్సింహ

గద్వాల అర్బన్: ఇష్టపడి చదివితే లక్ష్య సాధన సులువు అవుతుందని జిల్లా బాలల పరిరక్షణ అధికారి నర్సింహ, పట్టణ ఎస్ఐ అబ్దుల్ షుకూర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్యం పిల్లల హక్కు అని, పిల్లలందరు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలన్నారు. బాల బాలికలకు వేధింపులు, ఏవైన సమస్యలు ఎదురైతే డయల్ -100 లేదా 1098కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సభ్యుడు సురేష్, హెచ్ఎం విష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయండి



రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ: మేడికొండ-పులికల్ మీదుగా నాగలదిన్నెకు వెళ్లే రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి శేక్షవలి ఆచారి డిమాండ్ చేశారు. గురువారం మేడికొండ రోడ్డును కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పూర్తి చేయలేదని మండిపడ్డారు. త్వరగా పూర్తి చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జయన్న, మద్దిలేటి, పాండురంగరాజు, బస్వరాజు, రవీందర్, సులోచనమ్మ, మైనర్‌బాబు, దేవేంద్ర, ఫిరోజ్, శాలి, రఫి, గాలిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయొద్దు



అమరవాయిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

మల్దకల్: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ ఉమాదేవి నర్సరీ నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం మండలంలోని పెద్దపల్లి, పావనంపల్లి, అమరవాయి, బిజ్వారం, దాసర్‌పల్లి గ్రామాలలోని నర్సరీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా నర్సరీలలో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలన్నారు. హరితహారం నాటికి ప్రతి నర్సరీలో నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలను పెంచే విధంగా పంచాయతీ కార్యదర్శులు, నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని నర్సరీలలో 70 శాతం మొక్కలు పెంచడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, సర్పంచు పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ



ధరూరు జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మానవపాడు: మండలంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి మోమెరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షను డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గోవర్ధన్ శెట్టి, చీఫ్ ఎగ్జామినర్ పద్మావతి పర్యవేక్షించారు. 151 మంది విద్యార్థులకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తెలుగు పరీక్ష ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. మొత్తం 294 మంది విద్యార్థులకు 291 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి మొత్తం 17 మంది విద్యార్థులకు 17 మంది హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ కృష్ణ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డిపార్ట్‌మెంటల్ అధికారిగా భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో రోజు గురువారం ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని డీఈసీ సభ్యులు రమేష్‌లింగం, దేవేందర్ రెడ్డిలు తనిఖీ చేశారు. 78 మంది విద్యార్థులకు 76 మంది విద్యార్థులు హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజేశ్వర్‌లు తెలిపారు.

జ్ఞాన సముపార్జనే భీమ్ దీక్ష లక్ష్యం

అయిజ: జ్ఞాన సముపార్జనే భీమ్ దీక్ష లక్ష్యమని స్వేరోస్ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రవీణ్ మామిడాల అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలో భీమ్ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ జ్ఞానం ద్వారా జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. ప్రజలు చైతన్యం తీసుకొచ్చేందుకు దీక్షలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ వైస్ చైర్మన్ కందికంటి విజయ్, స్వేరో సర్కిల్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగడ్ల వెంకటేష్, జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్, స్వేరో సర్కిల్ జిల్లా అధ్యక్షుడు అంజి పాల్గొన్నారు.

తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు, ఉపాధ్యాయులు

మానవపాడు: మండలంలోని జల్లాపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు బతుకయ్య ఆధ్వర్యంలో తెలుగు ఉగాది నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. ఆత్మజ్ఞానం, తెలుగు పండుగ, నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకములు క్యాలెండర్‌లో ఆచార్య ప్రబోధానంద యోగి రూపొందించారని పేర్కొన్నారు. ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు వెంకట్రాముడు, కృష్ణ, శ్రీకృష్ణ, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు మద్దిలేటి, భాగ్యమ్మ, శ్రీలత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

తైబజారుకు వేలం పాట

రాజోళి: గ్రామ పంచాయతీలో తైబజారుకు వేలం పాటను స్థానిక గ్రామ పంచాయతీ వద్ద గురువారం నిర్వహించారు. కుర్వ బోరవెల్లి హరికృష్ణ రూ.3,35,000 లకు తైబజారును దక్కించుకున్నారు. పంచాయతీ అధికారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. వధశాల వేలంపాట వాయిదా పడిందని, త్వరలోనే మళ్లీ తేదీని ప్రకటిస్తామని సర్పంచ్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణయ్య, లక్ష్మణ్, మున్నా,రాజు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరమ్మ